

డాకు మహారాజ్ కేక

అభిమానుల సమక్షంలో విజయోత్సవం

పాటపాడి.. తొడగొట్టి అలరించిన బాలయ్య

తరలివచ్చిన తారాగణం.. టీడీపీ నాయకులు





విజయోత్సవ సభ వేదికపై చిత్ర తారాగణం, హాజరైన జనం, అభివాదం చేస్తున్న బాలయ్య

5

ఉష్ణోగ్రతలు



గరిష్ఠం	31.0
కనిష్ఠం	17.0

రైతుతోనే దేశాభివృద్ధి

వైసీపీ చేసిన నష్టం పూడ్చలేనిది

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

హిందూపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రైతులు ఆర్థికంగా ఎదిగినరోజే దేశాభివృద్ధి సాధ్యం అవుతుందని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. నియోజకవర్గ పర్యటనలో మూడోరోజు బుధవారం హిందూపురం మండలం గోళ్లాపురం, కిరికెర, పట్టణ పరిధిలోని మోతుకపల్లి వద్ద సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు సంక్షేమాన్ని గత వైసీపీ ప్రభుత్వం మరచిపోయిందన్నారు. ఫలితంగా గత ఐదేళ్లు పంటలు సాగు చేయడానికి జంకే పరిస్థితి వచ్చిందన్నారు. రైతులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలిస్తేనే అభివృద్ధి చెందుతారన్నారు. దానిని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఎన్నో పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. లోవోల్టేజీ కారణంగా చేతికందిన పంట నష్టపోవాల్సి వస్తోందనీ, ఈ సమస్యను అరికట్టేందుకు ప్రభుత్వం సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. మరో ఆరు నెలల్లో రాష్ట్రంలో లోవోల్టేజి సమస్య లేకుండా చేస్తామన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం అన్నిరకాల చర్యలు చేపడుతోందన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి, రైతులు పంటలు సాగుచేయడానికి, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కూటమి ప్రభుత్వం అండదండలు అందిస్తుందన్నారు.

వైసీపీ చేసిన నష్టం పూడ్చలేనిది...

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులకు చేసిన నష్టం పూడ్చలేనిదనీ, అభివృద్ధి 20ఏళ్లు వెనక్కు వెళ్లిందన్నారు. దానిని గుర్తించే ప్రజలు.. కూటమికి బ్రహ్మరథం పట్టారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.వెయ్యికోట్లు నిధులు తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. త్వరలోనే కార్యరూపం దాల్చుతుందన్నారు. హిందూపురం పట్టణంతోపాటు నియోజకవర్గంలో డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణం, మురుగునీటి శుద్ధిప్లాంట్ మరిన్ని అభివృద్ధి పథకాలు తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్ర, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

నిప్పు.. ముప్పు..



పచ్చిక బయళ్లకు నిప్పు పెడుతున్న ఆకతాయిలు

- పొలాలకు వ్యాపిస్తున్న మంటలు
- ఆహుతి అవుతున్న పంటలు
- పరుగులు పెడుతున్న వన్యప్రాణులు
- భయాందోళనల్లో రైతులు



చిలమత్తూరు మండలం కోడూరు వద్ద ఆకతాయిలు నిప్పు పెట్టడంతో కాలిపోతున్న పచ్చిక

చిలమత్తూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వేసవి వస్తే తాగు నీటికి కూడా జిల్లాలో ఇబ్బందులు తలెత్తుతుంటాయి. ఈ పరిస్థితుల్లో పచ్చదనం పెంపొందించుకోవడం ఎంతో అవసరం. ఉన్న పచ్చదనాన్ని కూడా నాశనం చేస్తున్నారు. పచ్చిక బయళ్లకు నిప్పు పెడుతున్నారు ఆకతాయిలు. తద్వారా భవిష్యత్తుకు ముప్పు తెచ్చుకుంటున్నారు. ఆకతాయిలు చేస్తున్న పనులు రైతుల గుండెల్లో రైలు పరుగెత్తేలా చేస్తున్నాయి. ఎండుగడ్డితో ఉన్న పచ్చిక బయళ్లకు అకారణంగా నిప్పు పెడుతున్నారు. దీంతో వందలాది ఎకరాల్లో పచ్చిక బయళ్లు గంటల వ్యవధిలో కాలి బూడిదవుతున్నాయి. ఆ మంటలు పంట పొలాలకు వ్యాపించి ఎలాంటి నష్టం వాటిల్లుతుందోనని రైతులు బిక్కుబిక్కుమంటూ కాపలా ఉండాల్సి వస్తోంది. మండలంలో ఎక్కువ విస్తీర్ణంలో పచ్చిక బయళ్లు ఉన్నాయి. ఈ ఏడాది వర్షాలు బాగా కురవడంతో బీడు భూముల్లో పచ్చిక ఏపుగా పెరిగింది. ఎండలు పెరగడంతో పచ్చగా ఉన్న గడ్డి ఎండిపోయింది. దీంతో ఆకతాయిలు ఏపుగా పెరిగిన గడ్డికి నిప్పు పెడుతున్నారు. ఆ మంటలు పంటపొలాలకు వ్యాపిస్తున్నాయి. రైతులకు నష్టం మిగులుస్తున్నాయి.

గాలివాటం ఉంటే క్షణాల్లో బూడిద

ఆకతాయిలు పెడుతున్న నిప్పుతో గాలివాటం ఎక్కడ ఉంటే ఆ వైపున ఒక్క క్షణంలో వందల ఎకరాల్లో మంటలు వ్యాపిస్తున్నాయి. వాటిని ఆర్పడానికి కూడా అవకాశం లేకుండా పోతోంది. గతేడాది భూపసముద్రం గ్రామానికి చెందిన రైతు నంజిరెడ్డి ఇలాంటి నిప్పు కారణంగా లక్షల్లో పంట నష్టపోయాడు. అతడి పొలం దగ్గర్లో పచ్చిక బయళ్లకు ఆకతాయిలు నిప్పు పెట్టడంతో మంటలు అతడి పొలానికి వ్యాపించాయి. డ్రిప్ పరికరాలు, పైపులు, టమోటా పంటకు ఉపయోగించే స్టేకింగ్ కర్రలు, మోటారు, కేబుల్ వైరు కాలి బూడిదయ్యాయి. దీంతో రైతు లక్షల రూపాయలు నష్టపోయాడు.

తీవ్ర నష్టం

ఆకతాయిలు చేస్తున్న పనులకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎవరు, ఎక్కడ నిప్పు పెడతారో తెలీదు. దాంతో పంట పొలాలను కాపాడుకునేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు కాపలా ఉండాల్సి వస్తోంది. ఎక్కడో దూరాన మంటలు వ్యాపించాయిలే అనుకుని నిర్లక్ష్యం చేస్తే మాత్రం పెను నష్టం తప్పదు. వేగంగా వ్యాపించే మంటలను ఆర్పివేయడం కష్టంతో కూడుకున్న పని. ఈ నేపథ్యంలో దూరంలో మంటలు చెలరేగినా.. రైతులు అప్రమత్తం కావాల్సిందే.

వన్యప్రాణుల పరుగులు

బీడు భూములకు నిప్పు పెడుతుండటంతో రైతులతోపాటు వన్యప్రాణులు సైతం అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాయి. ఈ ప్రాంతంలో జింకలు, అడవి పందులు, కుందేళ్లు, నెమళ్లు, గుంట నక్కలు వంటివి ఎక్కువగా ఉంటున్నాయి. పొలాలు, పచ్చిక బయళ్లలో పచ్చిక తింటూ మనుగడ సాగిస్తున్నాయి. ఆకతాయిలు పెడుతున్న నిప్పుతో పచ్చిక మొత్తం కాలి బూడిదవుతోంది. దాంతో అవి తినే పచ్చికతోపాటు అవి విశ్రాంతి తీసుకునే పొదళ్లు కూడా కాలి బూడిదవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంటలకు భయపడి అవి పరుగులు పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో పచ్చిక బయళ్లను కాపాడుకునే దిశగా సంబంధిత శాఖల అధికారులు.. ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



వేసవి నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. పంట పొలాల సరిహద్దు గట్లను శుభ్రంగా ఉంచుకోవాలి. వాటిపై పెరిగిన గడ్డిని తొలగించుకోవాలి, లేదంటే పొలం సరిహద్దు చుట్టూ ట్రాక్టర్‌తో దున్నుకోవాలి. ఇలా చేసుకోవడం ద్వారా ఆకతాయిలు పెట్టే మంట పొలానికి వ్యాపించకుండా అరికట్టవచ్చు. మంటలను ఆర్పడానికి వీలుగా నీరు నిల్వ ఉంచుకోవాలి.

\- ప్రభాకర్, అగ్నిమాపక శాఖాధికారి, హిందూపురం

సైబర్ నేరగాళ్ల మాయలు

ఖాతాలు ఖాళీ..!

బ్యాంకు ఖాతాల్లోని నగదు కాజేస్తున్న వైనం

లబోదిబో మంటున్న బాధితులు



మాయా నెమలి

గాండ్లపెంట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో ప్రజలను మోసగిస్తున్నారు. పలు రకాల ఆశలు చూపి, బురిడీ కొట్టిస్తున్నారు. డబ్బు జమవుతుందనీ, పథకాల ప్రయోజనాలు అందుతాయంటూ మెసేజ్‌లు పంపుతున్నారు. వాటిని క్లిక్ చేస్తేనో, ఓటీపీ చెబితేనో బ్యాంకు ఖాతాల్లోని నగదు మాయమవుతోంది. మండలంలోని ఓ వ్యక్తి మొబైల్ ఫోన్‌కు నాలుగురోజుల క్రితం ఓ మేసేజ్ వచ్చింది. మాయానెమలి చిత్రం ఉంది. దానిని తాకితే రూ.5వేలు బహుమతి గెలుచుకుంటారంటూ మెసేజ్ పంపారు. దానిని నమ్మి మాయానెమలిని తాకిన వెంటనే స్టిక్కర్ వచ్చింది. దానిని స్క్రాచ్ చేస్తే బ్యాంకు ఖాతాలోకి డబ్బు జమవుతుందన్నారు. స్క్రాచ్ చేసిన వెంటనే భారత్ జన్‌ధన్ యోజన ద్వారా భారతీయ జనతా పార్టీ.. దేశంలోని ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.ఐదువేలు జమ చేస్తుందన్న మెసేజ్ కనిపిస్తుంది. దానిని స్క్రాచ్ చేయగానే నగదు చెల్లింపుల యాప్‌లు ఓపెన్ అవుతున్నాయి. సీక్రెట్ నంబరు నమోదు చేయగానే ఖాతాలోని డబ్బు మాయమవుతోంది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు.



స్క్రాచ్ కార్డు

రూ.లక్ష మాయం

గాండ్లపెంటకు చెందిన జాఫర్ ఖాన్ చిన్న హోటల్ నిర్వహిస్తున్నాడు. ఇటీవల అవసరాల నిమిత్తం రుణం తీసుకుని, బ్యాంకులో రూ.లక్ష నగదు జమ చేశాడు. గతనెల 29వ తేదీన అతడి భార్య మాబూజాన్ మొబైల్ ఫోన్‌కు మెసెజ్ వచ్చింది. దానిని ఓపెన్ చేయగానే ఆమె ఖాతాలోని రూ.లక్ష మాయమైంది. దీంతో బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలాంటి బాధితులు మండలంలో చాలా మందే ఉన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.





జాఫర్‌ఖాన్ గాండ్లపెంట



నిప్పుకణిక..

పరిటాల రాకే పెను సంచలనం

ఇంటి నుంచే ఉమ్మడి జిల్లా రాజకీయం

రేపు పరిటాల రవీంద్ర 20వ వర్ధంతి

4

నకిలీ బంగారం

ముఠా అరెస్ట్

రూ.21 లక్షల నగదు, 5 ద్విచక్రవాహనాల స్వాధీనం



5

చంద్రబాబు కృషితోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా

- బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత



పెనుకొండ రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు కృషితోనే విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థిక భరోసా లభించిందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు ఢిల్లీ పర్యటనతోనే కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఎందరో ప్రాణత్యాగం చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ నష్టాల ఊబిలో కూరుకుపోయిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ఉత్తరాంధ్రతో పాటు విశాఖ ఉక్కు పరిశ్రమపై దృష్టి సారించిందన్నారు. గతంలో కూడా విశాఖ ఉక్కుపరిశ్రమ కష్టాల్లో ఉన్నపుడు సీఎం చంద్రబాబు అప్పటి కేంద్ర ప్రభుత్వాలతో మాట్లాడి, నిధులు రప్పించారన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి రికార్డుస్థాయిలో లాభాలు వచ్చేలా టీడీపీ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్మోహన్‌రెడ్డి తనపై ఉన్న కేసుల నుంచి బయటపడటానికి, స్వలాభం కోసం ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణ చేశారని మంత్రి సవిత ఆరోపించారు. ఏ రోజూ రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారానికి గానీ, విశాఖ ఉక్కుపరిశ్రమను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించాలనిగానీ కోరలేదన్నారు. ఈ నిజాలు దాచేసి, వైసీపీ అబద్ధాలను ప్రచారం చేసిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు కృషిచేసి, రూ.4లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. ప్రస్తుతం దావోస్‌లో పర్యటిస్తున్న వారిరువురు రాష్ట్రానికి మరిన్ని పరిశ్రమలు తీసుకురావడానికి కృషిచేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు.

పీఆర్సీ చైర్మన్‌ను నియమించాలి

కలెక్టర్‌కు యూటీఎఫ్ నాయకుల వినతి

కొత్తచెరువు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు 12వ పీఆర్సీ చైర్మన్‌ను నియమించాలంటూ కలెక్టర్ టీఎస్ చేతన్‌కు నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు యూటీఎఫ్ నాయకులు.. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. వారు మాట్లాడుతూ...పెండింగ్‌లో ఉన్న సరండర్ లీవు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పీఆర్సీ, సీపీఎస్ అమలుకు రోడ్డు మ్యాప్‌ను ప్రకటించాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు లక్ష్మీనారాయణ, శివ, నారాయణస్వామి, నరేశ్, కుమార్, రవీంద్రనాథ్, బాబు, కిష్టప్ప, రామాంజనేయులు, సురేశ్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అంతిమయాత్రకు తీరిన అవస్థలు

ఖబరస్థాన్‌కు సీసీ రోడ్డు నిర్మాణం

ముస్లింల హర్షం



బురదగుంతల రోడ్డుపై ఖబరస్థాన్‌కు వెళ్తున్న ముస్లింలు (ఫైల్)

ముదిగుబ్బలోని పాతూరు నూర్ ఏ మదీనా మసీదుకు చెందిన ఖబరస్థాన్‌కు రోడ్డు సౌకర్యం లేక ముస్లింలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. బురద నీటిలో అంతిమయాత్ర నిర్వహించాల్సి వచ్చేది. ఖననం సమయంలో ఇబ్బందులు చెప్పనలవికానివి. గత వైసీపీ హయాంలో ఖబరస్థాన్‌కు సీసీ రోడ్డు నిర్మించాలని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా హామీలతోనే సరిపెట్టారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. స్థానిక 4వ సచివాలయం వద్ద నుంచి ఖబరస్థాన్ వరకు దాదాపు 150 మీటర్ల దూరం సీసీ రోడ్డు నిర్మించారు. ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

\- ముదిగుబ్బ, ఆంధ్రజ్యోతి



నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు

నిప్పు కణిక...

పరిటాల రాకే పెను సంచలనం

మాజీ మంత్రి పరిటాల రవీంద్ర అంటే ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో పెను సంచలనం. విలక్షణ వ్యక్తిత్వంతో దశాబ్దం పాటు జిల్లా రాజకీయాలను శాసించిన ధీశాలి. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా నిరంతరం పోరాటం చేసిన ఆయన దివంగతుడై రెండు దశాబ్దాలు పూర్తవుతోంది. ఈ నెల 24న పరిటాల రవీంద్ర వర్ధంతి. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

– ఆంధ్రజ్యోతి, అనంతపురం

ఆయన్ను చూస్తే...ధైర్యం
రొమ్ము విరుచుకుని నవ్వుతుంది.
ఆపేరు కలలో వచ్చినా...
ప్రత్యర్థులకు నిద్ర కరువవుతుంది.
సాహసానికి మారుపేరుగా...
సంచలనాలకు చిరునామాగా..
అన్యాయాలు, అరాచకాలు,
అకృత్యాలకు సింహస్వప్నంగా..
బడుగు, బలహీన
వర్గాలకు కొండంత అండగా
పెత్తందార్ల ఆగడాలను
దహించే నిప్పు కణికగా ..
కారు చీకట్లను చీల్చిన మెరుపుగా..
కష్టాలు, కన్నీళ్లు, ఆకలి, అన్యాయాలకు
ఎదురొడ్డి పోరాడిన ధీరుడిగా..
పేదింటి ఆడబిడ్డలకు
పెళ్లిళ్లు చేసిన పెద్దకొడుకుగా..
నమ్మిన సిద్ధాంతం కోసం
ప్రాణాలొడ్డిన త్యాగమూర్తిగా..
ఆయన పేరు
చిరస్మరణీయం..స్ఫూర్తిదాయకం
ఆయనే దివంగత పరిటాల రవీంద్ర
ఆయన రాకే జిల్లా
రాజకీయాల్లో ఓ ప్రభంజనం
అనతి కాలంలోనే
జిల్లా రాజకీయానికి
కేరాఫ్ అడ్రస్‌గా నిలిచి
విలక్షణ వ్యక్తిత్వంతో ప్రజలకు
అభిమాన నాయకుడయ్యారు.
మరణించీ అభిమానుల గుండెల్లో
అస్తమించని 'రవి'గా మారాడు.


ఆంధ్రజ్యోతి పేపర్‌ను చదువుతున్న పరిటాల రవీంద్ర (ఫైల్)





- ఇంటి నుంచే ఉమ్మడి జిల్లా రాజకీయం
- ఆ నాలుగు అక్షరాలకు వెలకట్టలేని అభిమానం
- బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి
- పదేళ్ల రాజకీయం... వారసత్వానికి బాసట

రేపు పరిటాల రవీంద్ర 20వ వర్ధంతి

తండ్రి పరిటాల శ్రీరాములు బాటలోనే...

పరిటాల శ్రీరాములు, నారాయణమ్మ దంపతులకు పరిటాల రవీంద్ర 1958 ఆగస్టు 30న జన్మించారు. రామగిరి మండలం నసనకోట పంచాయతీ పరిధిలోని వెంకటాపురం ఆయన స్వగ్రామం. ఆ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీకి, నక్సలైట్ ఉద్యమానికి అండాదండా పరిటాల రవీంద్ర కుటుంబం. తండ్రి పరిటాల శ్రీరాములు కమ్యూనిస్టు నాయకులు. ఆ ప్రాంతంలో జరిగే అన్యాయాలు, భూస్వాముల పెత్తందారి విధానాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించేవారు. ఆయన మరణానంతరం వారసత్వంగా వచ్చిన బావజాలాన్ని పరిటాల రవీంద్ర భుజానికి ఎత్తుకున్నారు. అప్పటికి ఆయన వయస్సు కేవలం 15 సంవత్సరాలు. ఆ వయస్సులోనే అరాచకాలకు ఎదురొడ్డి నిలిచారు. ఈక్రమంలో తనకు అండగా ఉండే సోదరుడు పరిటాల హరిని ఎన్‌కౌంటర్‌లో పోగొట్టుకున్నారు. భూస్వాములు, ఫ్యాక్షనిస్టుల వేధింపులు అధికమయ్యాయి. అయినా వెరవలేదు. తండ్రి పరిటాల శ్రీరాములు ఏ ఆశయం కోసమైతే పనిచేశారో దాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకే అడుగులు వేశారు. ఈ కాలక్రమంలో అనేక సంఘటనలు జరిగాయి. అప్పటి మాజీ ఎమ్మెల్యే గంగుల నారాయణరెడ్డి హత్య కేసులో పరిటాలను ప్రధాన ముద్దాయిగా చేర్చడంతో అజ్ఞాత జీవితం గడపాల్సి వచ్చింది. అయినప్పటికీ తన కుటుంబానికి బాసటగా ఉంటూ వచ్చిన జనాన్ని సంఘటితం చేసుకుంటూ ఆ వర్గాలకు వెన్నుదన్నుగా నిలిచారు. నేనున్నానంటూ బడుగు, బలహీన, పీడిత వర్గాలకు అండగా నిలబడ్డారు.




మలుపు తిప్పిన 1983 ఎన్నికలు

ఉమ్మడి రాష్ట్రంలో 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు పరిటాల రవీంద్ర జీవితాన్ని అనుకోని మలుపులు తిప్పాయి. అప్పటి వరకూ కాంగ్రెస్ పార్టీ పాలన సాగించింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రేసేతర ప్రభుత్వాన్ని స్థాపించి ఆంధ్రుల అభిమాన నటుడు ఎన్టీ రామారావు ముఖ్యమంత్రి అయ్యారు. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక నూతన ఒరవడికి బీజం పడింది. అప్పటి వరకూ అజ్ఞాత జీవితం గడుపుతున్న పరిటాల రవీంద్ర 1984లో తన స్వగ్రామం వెంకటాపురం చేరుకున్నారు. అదే సమయంలో అక్టోబరు 27న సునీతను వివాహం చేసుకున్నారు. పరిటాల రవీంద్ర తండ్రి పరిటాల శ్రీరాములు హత్య కేసులో ప్రధాన ముద్దాయి సిద్దప్ప శిక్ష ముగించుకొని జైలు నుంచి బయటికి వచ్చాడు. 1986లో సిద్దప్పను నక్సల్స్ కాల్చి చంపారు. ఈ హత్య కేసులో పరిటాల రవిని ముద్దాయిని చేయడంతో మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. రహస్య జీవితం గడుపుతూనే... అప్పటి నక్సలైట్ ఉద్యమ ప్రముఖుడు కొండపల్లి సీతారామయ్యతో సన్నిహిత సంబంధాన్ని నడిపారు. ఈక్రమంలోనే సిద్దప్ప హత్య కేసు నుంచి బయటపడి తిరిగి వెంకటాపురానికి చేరుకున్నారు. తండ్రి శ్రీరాములు, సోదరుడు హరి సాగించిన భూస్వామ్య వ్యతిరేక పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడమే తన కర్తవ్యంగా భావించారు. అదే సందర్భంలో ఫ్యాక్షనిజాన్ని నిర్మూలించాలనే లక్ష్యంగా అడుగులు వేశారు. అందుకు అవసరమైన వనరులను సమకూర్చుకునే మార్గాల మీద దృష్టి సారించారు. ఆ క్రమంలో ఆయనకు ప్రత్యేక రక్షణ వ్యవస్థ ఏర్పడటంతో ప్రజా నాయకుడిగా తొలి అడుగు వేశారు. రాష్ట్రంలోనే తొలి మండల వ్యవస్థ ఎన్నికలు జరగడంతో ఆ ఎన్నికల్లో పరిటాల రవీంద్ర మద్దతుతో దళిత ఓబన్న అత్యధిక మెజార్టీతో రామగిరి మండల అధ్యక్ష పదవి దక్కించుకున్నాడు. అక్కడి నుంచి ఆయన ప్రజా నాయకుడిగా ప్రజల్లోకి వచ్చారు. ఆ తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడంతో పరిటాల రవీంద్రపై ప్రత్యర్థులు కక్ష గట్టారు. అయినా తాను నమ్మిన సిద్ధాంతాన్ని పరిటాల వీడ లేదు. కాంగ్రెస్ నాయకుల అరాచకాలకు ఎదురొడ్డి నిలిచాడు. ఈ క్రమంలో ప్రజల దృష్టిని మరింత ఆకర్షించాడు. రవీంద్రకి రోజు రోజుకు ప్రజా బలం పెరుగుతుండటంతో అతన్ని నక్సలైట్‌గా చిత్రీకరించి మట్టుపెట్టాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆయనకు సమాచారం అందింది. దీంతో అప్పటి ఎస్పీ కెప్టెన్ కేవీ రెడ్డి సమక్షంలో 1992లో పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఆ మరుసటి రోజు నుంచే పరిటాల రవీంద్ర క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రచారం జోరందుకుంది.

జైలులో నుంచే నామినేషన్.. ఎమ్మెల్యేగా విజయం



1994 ఆగస్టు 7న హైదరాబాదు సమీపంలోని షాద్‌నగర్‌లో జంట హత్యలు జరిగాయి. హతులిద్దరూ అప్పటి పెనుకొండ ఎమ్మెల్యే ఎస్వీ రమణారెడ్డి అనుచరులు కావడంతో ఆ కేసులో పరిటాల రవిని ప్రధాన ముద్దాయిగా చేశారు. జైలు నుంచే పెనుకొండ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా పరిటాల రవీంద్ర నామినేషన్ వేశారు. అన్ని అవాంతరాలను అధిగమించి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందాడు. రాష్ట్రంలోనూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మంత్రివర్గంలో కార్మికశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాడు. ఆ తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో... రాజకీయ సంక్షోభం రావడం... చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం వరుసగా జరిగిపోయాయి. ఎన్టీఆర్ మరణించిన తర్వాత ఎమ్మెల్యే పదవికి పరిటాల రవీంద్ర రాజీనామా చేశారు. తిరిగి ఉప ఎన్నికల్లో చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ తరఫున విజయం సాధించాడు. అప్పటి నుంచి ఉమ్మడి జిల్లా రాజకీయాల్లోనే కాదు... రాష్ట్ర రాజకీయాల్లో పరిటాల రవీంద్ర తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. ఉమ్మడి జిల్లాలో తెలుగుదేశం పార్టీలో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పించిన నాయకుడిగా ఆ వర్గాల్లో అభిమానాన్ని చాటుకున్నాడు. వేలాది మంది పేదింటి బిడ్డలకు ఉచిత పెళ్లిళ్లు చేసి ఆ కుటుంబాలకు పెద్ద దిక్కయ్యాడు. మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలతో చైతన్యం నింపారు. ఆయన రాజకీయాల్లో పదేళ్లు ఉన్నా ఆ కుటుంబానికి వెయ్యేళ్ల వారసత్వ రాజకీయాన్ని అందించారు. 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆయనను అంతమొందించేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఈ విషయం తెలిసినా వెరవక ప్రజల కోసం నిలబడ్డాడు. ఆ క్రమంలోనే 2005 జనవరి 24న హత్యకు గురయ్యారు. అయితే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, తన ప్రాంత అభివృద్ధి కోసం పరిటాల రవీంద్ర ఎలా పాటుపడ్డారో అదే విధంగానే ఆయన సతీమణి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆయన తనయుడు పరిటాల శ్రీరామ్‌లు కృషి చేస్తున్నారు.


సీఎం చంద్రబాబు నాయుడుతో (ఫైల్)


భార్య పరిటాల సునీతతో (ఫైల్)

చెస్‌లో చిచ్చర పిడుగు

అంతర్జాతీయ పోటీలకు అరవ విశ్వాణి

అనంతపురం క్లాక్‌టవర్/గుంతకల్లు టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్-2025, ఫిడే వరల్డ్ స్కూల్ చెస్ చాంపియన్ షిప్-2025 పోటీలకు గుంతకల్లుకు చెందిన అరవ విశ్వాణి అర్హత సాధించింది. ఇటీవల కాకినాడలో నిర్వహించి న నేషనల్ చెస్ పోటీల్లో ఈమె రన్నరప్ టైటిల్ కైవసం చేసుకున్నారు. త్వరలో ఏషియన్, వరల్డ్ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల తేదీ, వేదికను ప్రకటిస్తారని ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, గౌరవాధ్యక్షు డు బాలరాజు తెలిపారు. గుంతకల్లులోని ఓ ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న బాలికను చెస్ అసోసియేషన్ కోశాధికారి కిశోర్, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్‌నాయుడు, ఆంధ్రా చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి నాగార్జున తదితరులు అభినందించారు.



రన్నరప్ ట్రోఫీతో అరవ విశ్వాణి

మెరుగైన మార్కులు సాధించండి: డీఈఓ

అనంతపురం విద్య, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదుకుని టెస్ట్‌లో మంచి మార్కులు సాధించాలని డీఈఓ ప్రసాద్‌బాబు సూచించా రు. రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్టీయూ స్టడీమెటీరియల్ పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. డీఈఓ ప్రసాద్‌బాబు, సంఘ సేవకురాలు ఏజీ ప్రమీలమ్మ చేతులమీదుగా వీటిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుభవజ్ఞులు, నిపుణులైన టీచర్లు తయారు చేసిన మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ సుమారు 500 మంది విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేణుక, ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, రాష్ట్ర మున్సిపల్ కమిటీ కన్వీనర్ ఫణిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల ఆగ్రహం

- సహాయ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్
- అనంతలో అర్చక, పురోహితుల నిరసన
- దేవదాయశాఖ ఏసీ కార్యాలయం వద్ద ధర్నా


నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అర్చకులు, పురోహితులు

అనంతపురం కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అర్చక పురోహితుల పట్ల నీచంగా ప్రవర్తిస్తున్న జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఆదిశేష నాయుడును వెంటనే సస్పెండ్ చేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. సహాయ కమిషనర్ తీరును నిరసిస్తూ బుధవారం ఉమ్మడి జిల్లాలోని అర్చక పురోహితులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ హెచ్చెల్సీ కాలనీలో తహసీల్దార్ కార్యాలయం నుంచి దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం సహాయ కమిషనర్ కార్యాలయం లో సూపరింటెండెంట్ రామతులసిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లి జేసీ శివనారాయణశర్మను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైపీ ఆంజనేయులు మాట్లాడు తూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా డెత్ గ్రాట్యుటీ ఫైల్స్‌ను గత మూడేళ్లుగా క్లియర్ చేయకుండా సహాయ కమిషనర్ జాప్యం చేస్తున్నాడని విమర్శిం చారు. అర్చకుడు మృతి చెందితే ఆ కుటుంబంలోని వారికి డీడీఎన్‌ఎస్ పథకం వర్తింపజేయాల్సి ఉన్నా ఆమేరకు చర్యలు చేపట్టడం లేదన్నారు. సమస్యలపై అర్చకులు సహాయ కమిషనర్ కార్యాలయానికి వస్తే వారిని కలవకుండానే వెనక్కు పంపేస్తున్నారన్నారు. సమస్యలపై ప్రశ్నిస్తే అర్చకులు, ఆఖరుకు ఈఓ స్థాయి అధికారులపైనా బూతులతో విరుచుకు పడుతున్నాడన్నారు. సమస్యలు పరిష్కరించకుండా అర్చకుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఆదిశేషనాయుడును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అర్చక సమాఖ్య ఉపాధ్యక్షుడు మారుతీప్రసాద్, కోశాధికారి శ్రీనివాసులు, చేతన్, నవీన్, హనుమంతరాయుడు, గోపాల్, తిరుపతయ్య, చంద్రమౌళి, వెంకటగిరి, మాధవయ్య, రంగనాయకులు, వీరాంజనేయులు, రాజన్న, సునీల్, ప్రజ్వల్, కిరణ్‌స్వామి, విజయ్, ప్రకాష్, వెంకటరాముడు, విజయశాంతి పాల్గొన్నారు.

27న రాయలసీమ కలెక్టరేట్‌ల వద్ద ధర్నా: సీపీఎం

అనంతపురం కల్చరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ వెడల్పును కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో రాయలసీమ వ్యాప్తంగా ఈనెల 27న అన్ని కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. అనంతపురంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, మదనపల్లి జిల్లాల్లో దాదాపు ఆరు లక్షల ఎకరాలకు పైగా నీళ్లు ఇవ్వడానికి ఉద్దేశించబడింద న్నారు. 2012 నుంచి కర్నూలు, అనంతపురం జిల్లాలకు నీరు వస్తున్నా ఒక్క ఎకరం ఆయకట్టుకూ సాగునీరు ఇవ్వకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. మొదటిదశ కింద అనంతపురం జిల్లాలో 3.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చేందుకు పంటకాల్వలు తవ్వలేదన్నా రు. ప్రభుత్వాలు మారుతున్నా రాయలసీమ సాగునీటి వనరుల అభివృద్ధి మాత్రం ఆశించినంతగా జరగడం లేదన్నారు. హంద్రీనీవా నుంచి 10వేల క్యూసెక్కుల నీరు రావడానికి కాలువ వెడల్పు చేయాల్సిన అవసరముందన్నారు. అయితే కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ వేయడానికి టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రస్తుతం జీఓ నెం.404, 405 విడుదల చేసిందన్నారు. అయితే కాలువ వెడల్పు చేయకుండా ఇది సాధ్యం కాదన్నారు. లైనింగ్ పనులవల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదముందని రైతుసంఘాలు, జలసాధన కమిటీ, ఇతర రాజకీయ పార్టీలు ఆందోళన చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కలెక్టరేట్‌ల వద్ద చేపట్టే ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

మహారాష్ట్ర వ్యక్తి హత్య

డి.హీరేహాళ్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం గ్రామ పరిసర ప్రాంతాల్లో మహారాష్ట్రకు చెందిన పల్లి శంకర్‌బోస్లే(40) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు మహారాష్ట్రలోని నీరజ్ గ్రామానికి చెందిన పది మంది 15 రోజుల కిందట గ్రామ సమీపంలో టెంట్లు వేసుకొని ఉండేవారు. రెండురోజుల కిందట వారంత అక్కడి నుంచి వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. అయితే బుధవారం సాయంత్రం ఓబుళాపురం గ్రామానికి చెందిన కొందరు కాపరులు గొర్రెలను మేపుతూ గ్రామం వైపు వస్తుండగా చెట్ల కింద ఒక వ్యక్తి పడి ఉండటం గమనించారు. దగ్గరికి వెళ్లి చూడగా ఆ వ్యక్తిపై రక్తపు మరకలు ఉండటంతో విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. సీఐ వెంకటరమణ, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి ఒంటిపై కత్తిపోట్లు ఉన్నట్లు గుర్తించారు. చుట్టుపక్కల విచారించగా మృతుడు సంచారజాతికి చెందిన వ్యక్తి అని గ్రామస్థులు పేర్కొన్నట్లు తెలిపారు. పోలీసు డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసి మృతదేహాన్ని బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్పీఎఫ్ గణతంత్ర స్ఫూర్తి యాత్ర


పాదయాత్రగా బయలుదేరిన ఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది

గుంతకల్లు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ స్ఫూర్తితో రైల్వే రక్షణ దళం విధి నిర్వహణలో పునరంకితం కావాలని ఆర్పీఎఫ్ డీఎస్సీ మురళీకృష్ణ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంతకల్లు రైల్వే డివిజన్ ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గణతంత్ర దినోత్సవ స్ఫూర్తి యాత్రను చేపట్టారు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ఈ మారథాన్ వాక్ ప్రారంభించి, పట్టణం మీదుగా చిప్పగిరి, అక్కడి నుంచి పెంచలపాడు మీదుగా గుంతకల్లుకు చేరే విధంగా 40 కి.మీ.ల పాదయాత్రను డీఎస్సీ ప్రారంభించారు. కార్యక్రమంలో గుంతకల్లు ఏఎస్సీ అనిల్ కుమార్ సింగ్, రేణిగుంట ఏఎస్సీ రాజగోపాల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

డాకు మహారాజ్ కేక

అభిమానుల సమక్షంలో విజయోత్సవం

పాటపాడి.. తొడగొట్టి అలరించిన బాలయ్య

తరలివచ్చిన తారాగణం.. టీడీపీ నాయకులు









యాంకర్ శ్రీముఖి, నటి ఊర్వశి రౌతేలా ఉత్సాహం

అనంతపురం కల్చరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): డాకు మహారాజ్ విజయోత్సవం వేలాది మంది అభిమానుల మధ్య అట్టహాసంగా జరిగింది. అనంతపురం శివారులోని శ్రీనగర్ కాలనీలో బుధవారం రాత్రి నిర్వహించిన వేడుకకు హీరో నందమూరి బాలకృష్ణ సహా చిత్ర యూనిట్ హాజరైంది. ఇబ్బందులు తలెత్తకుండా ఎస్పీ జగదీష్ చర్యలు తీసుకున్నారు. సాయంత్రం 7.20 గంటలకు ప్రారంభమైన వేడుక రాత్రి 11 గంటల వరకూ సాగింది. శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఎన్బీకే హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో బాలయ్య పాటలకు కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. బాలకృష్ణ 50 సంవత్సరాల సినీ ప్రస్థానానికి సంబంధించి 3డి యానిమేషన్ చిత్రాన్ని ప్రదర్శించారు. దర్శకుడు బాబీ విజిల్ వేస్తూ 'చిన్ని చిన్ని' పాటను, బాలకృష్ణ 'గణ గణ గణాగణ' పాట పాడుతూ అభిమానులను అలరించారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కాలవ శ్రీనివాసులు, ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, అమిలినేని సురేంద్రబాబు, పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, మాజీ మేయర్ స్వరూప, రాయల్ మురళి, ఎన్బీకే హెల్పింగ్ హ్యాండ్స్ జగన్, టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు తాజుద్దీన్, సంగా తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

రెట్టింపు హిట్‌తో వస్తా

గతంలో తాను తీసిన సినిమాలన్నీ విజయాన్ని తెచ్చి పెడితే డాకు మహారాజ్ మాత్రం విజయంతోపాటుగా ఆనందాన్ని, కోట్ల మంది అభిమానాన్ని తెచ్చి పెట్టిందని దర్శకుడు బాబి కొల్లి అన్నారు. ప్రతి ఒక్కరూ ఇష్టపడి పనిచేయడం వల్లే ఇంతటి ఘన విజయాన్ని సాధించామని అన్నారు. డాకు మహారాజ్‌కు రెట్టింపు హిట్ కొట్టే సినిమాతో, రాష్ట్రాలు కాకుండా దేశాలు మాట్లాడే స్థాయిలో సినిమాతో వస్తానని అన్నారు.

- బాబి కొల్లి, దర్శకుడు

తరలివచ్చిన తారలు

డాకు మహారాజ్ సక్సెస్ మీట్‌కు నటుడు బాబీ డియోల్, హీరోయిన్లు ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధ శ్రీనాథ్, ఊర్వశీ రౌతేలా, బాలనటి వేదా అగర్వాల్, సంగీత దర్శకుడు తమన్, చిత్రదర్శకుడు బాబీ కొల్లి, నిర్మాత నాగవంశీ, డీఓపీ విజయ్ కార్తీక్ కన్నన్, రచయిత మోహన్ కృష్ణ వచ్చారు.

ఊపిరి ఉన్నంతవరకూ నటిస్తా: బాలకృష్ణ

అభిమానులు కాలర్ ఎగరేసి గర్వపడేలా చూసుకునే బాధ్యతను తన తండ్రి నందమూరి తారకరామారావు తనపై ఉంచారని బాలకృష్ణ అన్నారు. ఆయన స్ఫూర్తితో కొన ఊపిరి ఉన్నంతవరకూ నటిస్తానని, సందేశాత్మక చిత్రాలతో అలరిస్తానని అన్నారు. నటసార్వభౌముడు ఎన్టీఆర్ పుట్టిన తెలుగుగడ్డపై మనమంతా పుట్టడం ఎన్నో జన్మల పుణ్యఫలమని అన్నారు. వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా తనను గెలిపించిన సీమ బిడ్డలను మరవలేనని అన్నారు. తన అభిమానులే తన నిజమైన ప్రచారకర్తలు అని అన్నారు. దేశానికి ఒక రాష్ట్రపతిని, ఉమ్మడి రాష్ట్రానికి ఆరుగురు ముఖ్యమంత్రులను ఇచ్చిన రాయలసీమ.. రాయల్ సీమ అని అన్నారు.

చెప్పాం.. కొట్టాం.. : ఎస్ఎస్ థమన్

డాకు మహారాజ్‌తో హిట్ కొడతామని, అనంతపురంలో సక్సెస్ మీట్ పెడతామని ప్రీ రిలీజ్ సమయంలోనే చెప్పామని సంగీత దర్శకుడు థమన్ అన్నారు. అన్నట్లుగానే హిట్ కొట్టామని, అనంతపురంలో సక్సెస్ మీట్ పెట్టామని అన్నారు.


బాలకృష్ణ సహకారంతో విజయం: దగ్గుపాటి

ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఆగినచోటే విజయోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యేగా తన విజయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, లోకేష్‌తోపాటు బాలకృష్ణ సహకారం ఉందని తెలిపారు.

బాలయ్య పేరుతోనే చదువు: గౌస్‌మొద్దీన్

అందరూ తమ పుస్తకాల్లో దేవుడిపేరు రాసుకుని చదువుకుంటారని, తాను మాత్రం ఎన్బీకే అని రాసుకుని చదువుకున్నానని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్ అన్నారు. బాలకృష్ణ అంటే తనకు అంత అభిమానమని అన్నారు.









బాలకృష్ణకు పాదాభివందనం చేస్తున్న థమన్

నా అభిమాన హీరో: ఎంఎస్ రాజు

చిన్నప్పటినుంచి తాను అభిమానించే హీరో నందమూరి బాలకృష్ణ అని, ఆయన సినిమా సక్సెస్‌మీట్‌లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. తెలుగువారు ప్రపంచ దేశాల్లో ఎక్కడున్నా, వారి నోట మార్మోగే ధ్వని 'జై బాలయ్య' అని అన్నారు. బాలకృష్ణ గురించి సోషల్ మీడియాలో ఏది వచ్చినా చివరి అక్షరం వరకూ చదువుతానని అన్నారు.

బాలకృష్ణతో ఎంపీ అంబికా







ఎగ్జిబిషన్లతో విజ్ఞానం: డీఆర్ఎం



వివిధ దేశాల పురాతన టైపు రైటర్లను తిలకిస్తున్న డీఆర్ఎం, ఏడీఆర్ఎం

గుంతకల్లు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఎగ్జిబిషన్లు విద్యార్థులకు వినోదాన్నే కాకుండా విషయ అవగాహనను కలిగిస్తాయని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని రైల్వే కమ్యూనిటీ హాలులో ద నుమిస్మాటిక్ సొసైటీ ఆఫ్ రాయలసీమ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పురాతన నాణేలు, వస్తువులు, ఫొటోగ్రాఫ్‌ల ఎగ్జిబిషన్‌ను డీఆర్ఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే, సెంట్రల్, ఇతర పాఠశాలల విద్యార్థులు ఎగ్జిబిషన్‌కు వచ్చి బ్రిటీషు కాలం నుంచి ఇప్పటి వరకూ దేశంలో ముద్రించిన కరెన్సీ, నాణేలు, ఇతర దేశాల లీగల్ టెండర్లు, వివిధ కాలాల్లో వినియోగంలో ఉన్న టైపు రైటర్లు, టెలిగ్రాం యంత్రాలు, కెమెరాలు, ప్రొజెక్టర్లు, బైనాక్యులర్లు, కంపాస్‌లను తిలకించారు. రైలింజన్ల చిత్రపటాల వింటేజ్ కలెక్షన్స్‌పై అవగాహన చేసుకున్నారు. ఈ ఎగ్జిబిషన్ శుక్రవారం వరకూ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం యు. సుధాకర్, ఏపీఓ మధుసూదనరావు, సొసైటీ ప్రతినిధులు బీజీఆర్ గుప్త, ఎల్ఎన్ ఫెర్నాండెజ్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ. 14

అనంతపురం రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 14తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 450 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 8 పలికినట్లు ఆయన తెలిపారు.

నకిలీ బంగారం ముఠా అరెస్ట్

రూ.21 లక్షల నగదు, 5 ద్విచక్రవాహనాలు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం



నకిలీ హారాలను చూపుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

సోమందేపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారం హారాలు చూపి ప్రజలను మోసం చేసి డబ్బులతో ఉడాయించే ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలను వెల్లడించారు. ఎక్స్‌కవేటర్‌తో పొలాలను దున్నుతుంటే పాతకాలంనాటి బంగారం హారాలు లభ్యమయ్యాయని నమ్మబలికి.. వాటిని తక్కువ ధరకే ఇస్తామని ఆశచూపి మోసం చేశారని తెలిపారు. హిందూపురం నుంచి పెనుకొండ వైపు వస్తున్నారని తెలిసి దారికాశామని అన్నారు. 10 మంది ముఠా సభ్యులు దోచుకున్న సొమ్మును పంచుకుంటుండగా వలపన్ని పట్టుకున్నామని తెలిపారు. అదుపులోకి తీసుకుని విచారిస్తే నేరాన్ని ఒప్పుకున్నట్లు వెల్లడించారు. దీనిపై కుప్పం మండలం పైపాళ్యంలో వెంకటేశ్, విడపనకల్లుకు చెందిన ఈరన్న అనే వ్యక్తులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వీరిని సోమందేపల్లి మండలం బ్రాహ్మణపల్లి వద్దకు పిలిపించి, మాటల్లో మభ్యపెట్టి వారి వద్ద నుంచి నగదు తీసుకుని ఉడాయించారని పేర్కొన్నారు. ఈ మేరకు సోమందేపల్లి పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారని అన్నారు. రెండు కేసుల్లో రూ.24 లక్షలు కాజేసినట్లు వివరించారు. నకిలీ హారాలతో మోసం చేసిన నిందితులు రాణా కిష్టబాబు, ఏఆర్ శాంతరాజు, నయాజ్ అహ్మద్, ఎం. ఈరన్న, బాబు, షికారి అర్జున్, గోవిందుల ఆనంద్‌బాబు, సోమాల్‌బంగారి, ఈడిగ హరిప్రసాద్, పిచ్చిగుంట్ల మారెప్పను అరెస్ట్ చేసి కేసు నమోదుచేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.21 లక్షల నగదు, ఐదు బైక్‌లు, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ రాఘవన్, ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వాచ్‌మన్ మృతి



మృతి చెందిన వారాదప్ప

ధర్మవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం వద్ద ఓ గ్రానైట్ పరిశ్రమలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వారాదప్ప (68) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు... చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లికి చెందిన వారాదప్ప గ్రానైట్ పరిశ్రమలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. తెల్లవారుజామున గ్రానైట్ నుంచి బయటకు వెళ్లాడు. చుట్టు పక్కల వారు గమనించి గ్రానైట్ పరిశ్రమ యజమాని చంద్రకు సమాచారం అందించారు. ఆయన వన్‌టౌన్ పోలీసులకు తెలపడంతో సీఐ నాగేంద్రప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గ్రానైట్ పరిశ్రమ యజమానితో మృతుడి వివరాలను అడిగితెలుసుకున్నారు. మృతుడు అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య కిష్టమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణదాతకు సత్కారం

- సకాలంలో స్పందించిన వైద్యుడు
- కృతజ్ఞతలు తెలిపిన ఉపాధ్యాయులు

పామిడి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఆసుపత్రికి వచ్చిన రోగిపట్ల సకాలంలో స్పందించి ప్రాణాలు నిలిపిన వైద్యుడు రాఘవేంద్రరెడ్డిని బుధవారం ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించింది. వివరాలలోకి వెళితే... గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న కె. నాగభూషణం ఈ నెల 3న విధి నిర్వహణలోనే ఛాతిలో నొప్పి రావడంతో సహోపాధ్యాయుడు కులశేఖర్‌రెడ్డి హుటాహుటిన పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విధుల్లో ఉన్న వైద్యుడు రాఘవేంద్ర రెడ్డి సకాలంలో స్పందించి ఎంతో విలువైన ఇంజెక్షన్‌ను ఉచితంగా వేసి ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా కేంద్రానికి రెఫర్ చేశారు. అనంతపురంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఉపాధ్యాయుడు నాగభూషణంకు స్టంట్ వేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. సకాలంలో గుండెపోటును గుర్తించి అవసరమైన చికిత్సను అందించి ప్రాణాలు కాపాడినందుకు ఆ పాఠశాల ఉపాధ్యాయుల బృందం వైద్యుడు రాఘవేంద్రరెడ్డికి శాలువాలు కప్పి పూలమాల వేసి ఘనంగా సత్కరించింది. వైద్యుడికి సహాయ సహకారాలు అందించిన స్టాఫ్ నర్సు శివకుమారి, నర్సులు సుధారాణి, రోహిణిని అభినందించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి.ఆదినారాయణరెడ్డి, ఉపాధ్యాయులు గోపాల్‌నాయుడు, కులశేఖర్‌రెడ్డి, సీహెచ్‌సీ వైద్యాధికారి శివకార్తికేయరెడ్డి, వైద్యులు షర్మిల, కమలాధర్, మనీషా, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.



పామిడిలో వైద్యుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

26న రాష్ట్ర స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఎస్‌పీఎస్ఆర్‌సీ ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేథ 2025 పేరుతో క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించనున్నట్టు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఒక పాఠశాల నుంచి ముగ్గురితో కలిసి ఉన్న ఒక టీమ్ మాత్రమే పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ నెల 24 సాయంత్రం 5 గంటల లోపు ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490336550ను సంప్రదించాలన్నారు.

వైసీపీ మడకశిర ఇన్‌చార్జిపై కేసు

జడ్పీటీసీ భూతరాజుపై ఈరలక్కప్ప వర్గీయుల దాడి పోలీసులకు ఫిర్యాదు

గుడిబండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ మడకశిర నియోజకవర్గ ఇన్‌చార్జి ఈరలక్కప్పపై పోలీసులు కేసు నమోదు చేశారు. గుడిబండ జడ్పీ టీసీ సభ్యుడు భూతరాజుపై ఈరలక్కప్ప వర్గీయులు మంగళవారం దాడి చేశారు. దీనిపై భూతరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. భూతరాజు పని నిమిత్తం రొళ్ల గ్రామానికి వెళ్లారు. గుడిబండవైపు తిరిగి వస్తుండగా.. ఈరలక్కప్ప స్వగ్రామమైన ఫళారంలో ఆయనతోపాటు కుటుంబ సభ్యులు.. తనపై దాడి చేశారని భూతరాజు ఆరోపించారు. అనంతరం గుడిబండ మాజీ జడ్పీటీసీ శివకుమార్ తనను కులం పేరుతో దూషించడమేకాక, నానా దుర్భాషలాడాడని పోలీసులకు భూతరాజు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈరలక్కప్ప, ఆయన కుటుంబీకులు, మాజీ జడ్పీటీసీ శివకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జడ్పీటీసీ భూతరాజు తమపై దాడి చేశారంటూ ఫళారం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

న్యూస్ బాక్స్

నేడు పశువైద్య శిబిరాలు

నంబులపూలకుంట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికొమ్మెదిన్నె, జౌకల గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు గురువారం నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి బాలనాయక్ తెలిపారు. 24న మండెంవారిపల్లి, చీమలచెరువుపల్లి, 25న పెడబల్లి, బలిజపల్లి, 27న పి.కొత్తపల్లి, దిగువతూల్లి, 28న ఎదురుదొన్న, మూలపల్లి, 29 మేకలచెరువు, మూడుపులజీవి, 30న వంకమద్ది, పోరెడ్డివారిపల్లి, 31న వరావాండ్లపల్లి, దేవరపల్లి గ్రామల్లో పశువైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. పశువుల కాపరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చీడల నుంచి పంటను కాపాడుకోండి

నంబులపూలకుంట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వేరుశ నగ పంటను చీడపీడల నుంచి కాపాడుకోవాలని ఏఓ లోకేశ్వర్ రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని పి.కొత్తపల్లి, పెడబల్లిలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 60 రోజుల లోపు ఉన్న వేరుశనగ పంటకు ఎకరాకు రెండువందల కిలోల జిప్సమ్ చల్లాలన్నారు. ఈదశలో ముఖ్యంగా రసం పీల్చే పురుగులు, పొగాకు లద్దె పురుగు, మువ్వకుళ్లు, కాడం కుళ్లు సోకే అవకాశముందన్నారు. ప్రస్తుతం రబీలో వరిపంటను నాటే రైతులు పైరుకు పైన కొనలున్న తుంచి నాటుకోవాలని, వరిలో ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్ల కాలిబాటలు వదలు కోవాలని సూచించారు.

జిప్సం వాడకంతో అధిక దిగుబడి

నల్లచెరువు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పంట సాగుచేసిన 40 రోజుల్లో జిప్సం వాడటంతో పంట అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ భారతి రైతులకు సూచించారు. బుధవారం రాజమొళ్లపల్లి, రాజమొళ్లపల్లితండా గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులందరూ పంటనమోదు తప్ప కుండా చేసుకోవాలన్నారు. ఉద్యానశాఖలో ఉన్న పండ్లు, పూల తోటల పెంపకం, ప్రోత్సహకాల గురించి తెలిపారు. డ్రిప్ కావలసిన రైతులు రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఏ మణికంఠ, ఈహెచ్ఏ రాధ, రైతులు పాల్గొన్నారు.

వేరుశనగకు మచ్చ తెగులు

బత్తలపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంటకు మచ్చ తెగులు సోకిందని, నివారణకు రైతులు తగు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్త రామ సుబ్బయ్య, ఏడీ క్రిష్ణయ్య, ఏఓ ఓబిరెడ్డి సూచించారు. బుధ వారం మండలంలోని పోట్లమర్రి గ్రామంలో బావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటను వారు పరిశీలించారు. చలిగాలులు ఉండడం వలన వేరుశనగ పంటకు మచ్చ తెగులు సోకుతోందని, నివారణకు అర లీటరు నీటికి 2గ్రాములు, లేదా హెక్సాకోజుల్ లీటరు నీటికి రెండు మిల్లీలీ టర్లు 15రోజులకు రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు.

రోడ్డు నియమాలపై అవగాహన

ఓబుళదేవరచెరువు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఎస్ఐ మల్లికార్జునరెడ్డి బుధవారం పాఠశాలల బస్సు డ్రైవర్లకు రోడ్డు నియమాలపై అవగాహన, కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్డు నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటరాముడు, జమేదార్లు వెంకటరాముడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రిన్సిపాల్ మృతి


హరేంద్రప్రసాద్(ఫైల్)

కదిరిఅర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వం బాలుర జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ హరేంద్రప్రసాద్ (59) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం కళాశాలలకు వచ్చిన ఆయన మధ్యాహ్నం 12 గంటలకు నీరసంగా ఉందని, ఇంటికెళ్లి విశ్రాంతి తీసుకుంటాని అధ్యాపకులకు చెప్పి వెళ్లారు. ఇంటికెళ్లిన కొద్దిసేపటికే గుండెపోటు రావడంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు.. ఆయనను ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. హరేంద్రప్రసాద్ స్వగ్రామం క ర్నూలు జిల్లాలోని చాగలమర్రి. గతేడాది మార్చిలో బదిలీపై కదిరికి వచ్చారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన మృతికి అధ్యాపకులు సంతాపం వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో ఆర్టీసీ కార్మిక నేత..


రమణారెడ్డి (ఫైల్)

తనకల్లు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజు వారిపల్లికి చెంది న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి, కార్మిక నేత ఎంబీవీ రమణారెడ్డి (72) అనారోగ్యంతో బుధవారం మర ణించారు. అంతిమ యాత్రను ఆర్టీసీ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో ఆర్టీసీ ఎంప్లా యీస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు నబీరసూల్, జిల్లా నాయకుడు సీవీపీ ఆర్ఎస్ రెడ్డి, కృష్ణయ్య, డిపో నాయకులు దివాకర్, శంకర్, ఉద్యోగులు, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు యాక్బుఖాన్, విశ్రాంత సీనియర్ నాయకులు పీవీ రెడ్డి, అల్తాఫ్ పాల్గొన్నారు. రమణారెడ్డి 30 సంవత్సరాలు ఎంప్లా యీస్ యూనియన్‌లో వివిధ స్థాయిల్లో పని చేశారు. ఆర్టీసీ ఎంప్లాయీస్ రీజనల్ చైర్మన్‌గా అనేక ఉద్యమాలు చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

నంబులపూలకుంట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యశాలను డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్ బుధవారం తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి ఆనంద్‌వర్ధన్, పార్మసిస్టు ప్రకాశం, సూపర్‌వైజర్ మహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

● కదిరి: తలుపులలోని ప్రభుత్వ ఆసుపత్రిని డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్ తనిఖీ చేశారు. ప్రతి వార్డును, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. అలాగే రికార్డులను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలని సూచించారు. మండలంలోని పులిగిండ్లపల్లిలో ఆయుష్‌మాన్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు.

బాల్యవివాహాలతో అనర్థాలపై అవగాహన

నల్లచెరువు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సమత ఎన్జీవో ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఎంపీడీఓ రఘునాథ్ గుప్తా మాట్లాడుతూ... పిల్లలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వయస్సు వచ్చాకే వివాహం చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ గంగరత్నం తెలిపారు. మొబైల్ ఫోన్లు చూడడం వలన చాలామంది పక్కదారి పడుతున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో మండల కో-ఆర్డినేటర్ మౌనిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రఫీమున్నీషా, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మూడేళ్లయినా..!

- నిరుపయోగంగా మార్కెట్‌యార్డు భవనం
- రూ.3.82 కోట్ల ప్రజాధనంతో నిర్మాణం
- పూర్తయినా.. ప్రారంభించని వైనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు


అరవాండ్లపల్లి వద్ద నిరుపయోగంగా ఉన్న భవనం

నల్లమాడ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు పండించిన పంటలను విక్రయించడానికి అనుకూలంగా ఉండటానికి మండల కేంద్రానికి సమీపంలోని అరవాండ్లపల్లి వద్ద వ్యవసాయ మార్కెట్‌ను నిర్మించారు. సుమారు 14 ఎకరాల్లో మొదటి విడతగా రూ.3.82 కోట్లతో భూమిని చదును చేసి, భవనాన్ని నిర్మించారు.



కొత్తచెరువులోని మార్కెట్‌యార్డు

భవన నిర్మాణం పూర్తయి మూడేళ్లు అయినా.. ఇంతవరకూ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం నల్లమాడ మార్కెట్ యార్డును కొత్తచెరువులో నిర్వహిస్తున్నారు. నల్లమాడ మార్కెట్‌యార్డును ప్రారంభిస్తే నల్లమాడతో పాటు అమడగూరు, ఓడీసీ మండలాల రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

● తప్పని కష్టాలు

మార్కెట్ యార్డు ప్రారంభం కాకపోవడంతో ఈ ప్రాంత రైతులు పండించిన పంటలను విక్రయించేందుకు సుదూర ప్రాంతాలకు అద్దె వాహనాల్లో తీసుకెళ్ళిన దుస్థితి నెలకొంది. మండల కేంద్రంలోనే మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తున్నారని, ఇకనుంచి పండించిన పంటలను ఇక్కడే విక్రయించుకోవచ్చని రైతులు చాలా సంతోషపడ్డారు. అయితే వారి ఆశలు అడియాశలయ్యాయి. ఈప్రాంత రైతులు పంటలను దూర ప్రాంతాలకు తీసుకెళ్లడంతో రవాణా ఖర్చులు, అక్కడ మార్కెట్‌లో కమిషన్లతో ఇబ్బందులు పడుతున్నారు. ఏ మాత్రం గిట్టుబాటు కావడంలేదని రైతులు వాపోతున్నారు.

● వైసీపీ నిర్లక్ష్యం

అరవాండ్లపల్లి వద్ద మార్కెట్‌యార్డు భవనాన్ని నిర్మించి మూడేళ్లు అయింది. నాటి వైసీపీ పాలకులు దాన్ని ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేశారు. ఈ మార్కెట్ యార్డును నల్లమాడకు దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఊరికి దూరంగా ఉండటంతో ఈ భవనం మందుబాబులతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఈ భవనాన్ని ప్రారంభిస్తే తమకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆశగా ఎదురు చూస్తు న్నారు. ఇప్పటికైనా అధికారులు, కూటమి పాలకులు స్పందించి మార్కెట్‌యార్డు భవనాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

ఐక్యతతోనే గ్రామాల అభివృద్ధి: ఆర్డీఓ



సమస్వయ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వీవీఎస్ శర్మ

కదిరి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామస్థులందరూ ఐకమత్యంగా ఉంటేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆర్డీఓ వీవీఎస్ శర్మ సూచించారు. బుధవారం స్థానిక రెడ్స్ కార్యాలయంలో ప్రభుత్వ అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐకమ త్యంగా ఉంటే అన్ని సమస్యలు పరిష్కరిం చుకోవచ్చని, ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. రెడ్స్ ఆధ్వర్యంలో 15 సంవత్సరాలు బీళ్లుగా ఉన్న భూమును సాగులోకి తీసుకురావడాన్ని ఆయన అభినం దించారు. రెడ్స్ డైరెక్టర్ భానుజ మాట్లాడుతూ.. రాయలసీమలో నీటి యజమాన్యం కార్యక్రమంలో భాగంగా కదిరి మండలంలోని ఎగువపల్లి, నల్లమాడ మండలంలోని దొన్నికోట పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం, బీడు భూముల అభివృద్ధి చేపట్టామన్నారు. హంద్రీ నీవా ప్రాజెక్టు ద్వారా ఊట నీరు వచ్చి ఎగువపల్లిలో 60 ఎకరాలు పంటకు ఉపయోగపకుండా ఉండేదన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా కాలువ తీయించి, చెరువులోకి నీటిని మళ్లించామన్నారు. త ద్వారా 60 ఎకరాలు సాగులోకి వచ్చిందన్నారు. హార్టికల్చర్ అధికారి ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో వాసన్ సంస్థ ఉత్తప్ప, సెంట్రీ సంస్థ నుంచి అరుణ్, రెడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పరిటాల రవీంద్ర వర్ధంతి


ధర్మవరం : సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): దివంగత పరిటాల రవీంద్ర వర్ధంతిని స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఆ రోజున పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, వాటికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పరిటాల అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతంకాటమయ్య, నాయకులు చిగిచెర్ల ఓబిరెడ్డి, చింతలపల్లి మహేశ్‌చౌదరి, మద్దిలేటి, పణికుమార్, పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, నాగూర్ హుస్సేన్, పోతుకుంట లక్ష్మన్న, చింతపులుసు పెద్దన్న, బొట్టుకిష్ట, చిన్నూర్ విజయ్‌చౌదరి, అత్తర్ రహీం, కేశగాళ్లశీన, చట్టా లక్ష్మీనారాయణ, కరెంటుఆది,వరదరాజులు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

● ముదిగుబ్బ : వెంకటాపురంలో శుక్రవారం నిర్వహించే పరిటాల రవీంద్ర వర్ధంతికి తరలిరావాలని టీడీపీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి.. విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోట్లబాబి, సునీల్, ప్రసాద్‌నాయుడు, సోమశేఖర్, సాకే కృష్ణ, చంద్రబాబు, సాయి,వెంకటరమణ, రామచంద్ర, సోము పాల్గొన్నారు.

● బత్తలపల్లి: వెంకటాపురంలో పరిటాల రవీంద్ర 20వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నారని, అధిక సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని మండల టీడీపీ నాయకులు నాయకులు నెట్టెం రమణ, మనోజ్ కోరారు.

గడ్డివాము దగ్ధం

క్రైం న్యూస్ ..

కొత్తచెరువు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరాపురం క్రాస్ సమీపంలో రైతు పూజారి పోతన్నకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో అవి కాలి బూడిదయ్యాయి. మొత్తం నాలుగు బండ్ల శెనగ కట్టె, పది బండ్ల వరి గడ్డి దగ్ధమైందని, మొత్తం రూ.70 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు పోతన్న తెలిపాడు. అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే గడ్డి పూర్తిగా కాలిపోయిందన్నారు. ప్రభుత్వం స్పందించి పశుగ్రాసం అందించాలని బాధిత రైతు పోతన్న విజ్ఞప్తి చేస్తున్నాడు.

బాలుడి ఆచూకీ లభ్యం

ఓబుళదేవరచెరువు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలుడిని ఆరు గంటల్లో వెతికి తల్లిదండ్రులకు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అప్పగించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో నివాసముంటున్న రామక్రిష్ణ కుమారుడు హేమంత్ కనిపించలేదని తండ్రి రామక్రిష్ణ మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ ఆరుగంటలలోపు ఆ బాలుడు కొండకమర్ల గ్రామంలో ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థిని మంగళవారం అర్థరాత్రి రాత్రి తల్లిదండ్రులకు అప్పగించారు.

ముళ్లపొదలు తొలగించండి


రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు

నల్లమాడ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చారుపల్లి నుంచి నడింపల్లి వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపులా భారీగా ముళ్లకంపలు పెరిగాయి. రెడ్డిపల్లి నుంచి నడింపల్లి వరకు ఉన్న 15 కిలోమీటర్ సింగల్ రోడ్డు ముళ్లపొదలతో కుంచించుకుపోయింది. ఈ మార్గంలో దాదాపు 17, 18 మలుపులున్నాయి. మలుపులున్న ప్రాంతంలో ఈ ముళ్లపొదలు ఉండటంతో.. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక.. పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో తోడు ఉదయం వేళ పొగమంచు ఉండటంతో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ముళ్లపొదలను తొలగించాలని పలు మార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు.

జనసేనకు గ్లాస్ గుర్తు రిజర్వుపై హర్షం

కదిరిఅర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీకి గాజు గ్లాస్ గుర్తును రిజర్వు చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంపై జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలో వారు గాజు గ్లాస్ చూపిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి చేరిక

ధర్మవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుకుంటలో వైసీపీకి చెందిన 50 కుటుంబాల సభ్యులు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో బుధవారం జనసేనలో చేరారు. పోతుకుంటకు చెందిన వైసీపీ నాయకులు లడ్డు ఆదినారాయణరెడ్డి, కడ్డీల వెంకటరామిరెడ్డి, సుబ్బిరెడ్డి, శ్రీని వాసులు, బుల్లె అశోక్‌కుమార్ జనసేనలో చేరిన వారిలో ఉన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

యజమాన్య పద్ధతులపై అవగాహన

నల్లమాడ, జనవరి22 (ఆంధ్రజ్యోతి): యజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించడంపై నల్లమాడ, ఓడీసీ, అమడగూరు మండలాల రైతులకు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వచ్చేలా మార్కెటింగ్ దశగా వెళ్లి ఏపీఎస్ఓసీఏ సీడ్ సర్టిఫికెటు పొందే రైతులుగా మారాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్ ప్రాముఖ్యతను, ఉపయోగాలను వివరించారు. సీడ్ టూసెల్ విత్తనం వేసినప్పటి నుంచి మార్కెటింగ్ వరకు రైతులు పాటించాల్సిన పద్ధతులు, ఉత్పత్త, మార్కెటింగ్‌పై మెలకువలు సూచించారు. ఎఫ్‌పీఓ సంస్థ ద్వారా సేకరించిన, వేరుశనగ పంట ఉత్పత్తి, ఆయిల్, తదితర వాటిని రైతులకు వివరించారు. మండలానికి ఐదుగురు రైతులను ఎంపిక చేసి, మూడు మండలాలకు 15మందితో ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేయించి, గుడ్ అగ్రికల్చర్ ప్రాజెక్టు చేయించి, రైతులకు జీఏపీ సర్టిఫికెట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఏఓ రమణప్ప, కదిరి ఏడీ సత్యనారాయణ, ఏఓ సుమతి, ఏపీఎం గోపాల్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'జగనన్న' భూ నిర్వాసితుల విచారణ

కొత్తచెరువు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం హయాంలో జగనన్న లేఅవుట్ల కోసం రైతుల నుంచి భూమిని సేకరించింది. భూమి ఇచ్చిన రైతులకు ప్రభుత్వ పరిహారం అందిందా లేదా అని విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. అందులో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ధర్మవరం రహదారిలో 384 సర్వే నెంబరులో రైతులు గోపాల్, కొండమీదరాయుడు నుంచి భూమి జగనన్న లేఔట్ల కోసం తీసుకుంది. వారికి ప్రభుత్వం ఎకరాకు రూ.10 లక్షల ప్రకారం అందిందా లేదా అని విజిలెన్స్ సీఐ సద్గురు, వాసు ప్రకాశ్ వివరాలు సేకరించారు. వారు ఇచ్చిన వివరాలను ప్రభుత్వానికి పంపుతా మని వారు తెలిపారు. ఎవరైన రైతులు భూమిని కోల్పోయి పరిహారం అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని, 93986 36256 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.


భూములు ఇచ్చిన రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

డీఎస్పీగా హేమంత్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



ధర్మవరం/పుట్టపర్తిరూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం డివి జన్ డీఎస్పీగా హేమంత్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయనగరం గ్రేహౌండ్స్‌లో ప్రొహిబిషర్ డీఎస్పీగా విధులు కొనసాగిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు మంగళగిరి హెడ్ క్వార్టర్స్‌కి రిపోర్టు చేసుకోవాలని జిల్లా పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. దీంతో నూతన డీఎస్పీ హేమంత్‌కుమార్‌కి ఆయన పదవీ బాధ్యతలు అప్పగించారు. హేమంత్ కుమార్ గతంలో తాడిపత్రి ట్రైనీ డీఎస్పీగా విధులు నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీఎస్పీ హేమంత్ కుమార్ ఎస్పీ రత్నను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, డీఎస్పీ శ్రీనివాసులును డీపీఓలో ఎస్పీ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ హేమంత్ కుమార్, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఆర్ఐ వలి పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా అందజేత

ధర్మవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తూ ఇటీవల ఇద్దరు పారిశుధ్య కార్మికులు మరణించారు. వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఎక్స్‌గ్రేషియా చెక్కులను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్ అయూబ్‌ఖాన్ బుధవారం అందజేశారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


పుట్టపర్తి : పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్

పుట్టపర్తిటౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఈనెల 31వరకు నిర్వహిస్తున్న ఉచిత పశుఆరోగ్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో అందుకు సంబంధించిన ప్రచార పోస్టర్లను విడుదల చేసిన ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పశుపోషణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ.. నిధులు కేటాయిస్తోందన్నారు. ఉచిత పశు ఆరోగ్య శిబిరాల నిర్వాహణకు 32 మండలాల్లో మండలానికి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని పశుపోషకులందరూ ఈ శిబిరాల్లో పశువుల జబ్బులకు చికిత్సలు చేయించుకుని ఉచితంగా మందులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఏడీ సుబదాస్, డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

● ధర్మవరంరూరల్ : ఉచిత పశుఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ధర్మవరం పశుసంవర్ధకశాఖ ఏడీ వీరభద్రయ్య తెలిపారు. మండలంలోని చిగిచెర్ల గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. పాడిపశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించారు. పాడి పశువుల శాస్త్రీయ యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శేఖర్, ఏహెచ్‌ఏలు ప్రభాకర్, భాషా, మౌనిక, శ్రావణి, సందీప్, గాయత్రి, రాము, పవన్, దివాకర్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

మట్టి పరీక్షకు తప్పని పరుగులు

● రైతులకు ఉపయోగపడని అగ్రి టెస్టింగ్ ల్యాబ్
● సాయిల్ టెస్టింగ్‌కు అనంతపురం వెళ్లాల్సిందే..

మడకశిర రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్ తమకు ఉపయోగపడడం లేదని రైతుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ ల్యాబ్ మడకశిరలో ఏర్పాటు చేసినా మట్టి నమూనాలకు మాత్రం పరీక్షలు నిర్వహించడం లేదు. దీంతో రైతులు మట్టి తీసుకుని అనంతపురం పరుగులు పెట్టాల్సి వస్తోంది. వైసీపీ ప్రభుత్వం 2021లో స్థానిక మార్కెట్ యార్డులో 62.30 లక్షలతో ఈ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను నిర్మించింది. ఇందులో ఒక వ్యవసాయ అధికారి, ఇద్దరూ ఏఈఓలు పనిచేస్తున్నారు. ఈ ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, మట్టి నమూనా పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతం కేవలం విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల శాంపిళ్లు మాత్రమే పరీక్షిస్తున్నారు. అవి కూడా ఇతర జిల్లాల నుంచి వచ్చే నమూనాలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారు. నాలుగేళ్లకుగాను ఇప్పటి వరకు కేవలం 330 ఎరువుల శాంపుల్స్ 346 విత్తన 200 క్రిమిసంహారక మందుల శాంపుల్స్‌ను మాత్రమే పరీక్షించారు. మట్టి నమూనాలకు మాత్రం పరీక్షలు నిర్వహించడం లేదు. దీంతో రైతులు వ్యయప్రయాసలకోర్చి మట్టి నమూనాలను సుదూరంలో ఉన్న అనంతపురం ల్యాబ్‌కు తీసుకెళ్లాల్సివస్తోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని స్థానికంగా ఉన్న అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లోనే సాయిల్ పరీక్షలు చేయాలని రైతులు కోరుతున్నారు.


మడకశిరలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్ కార్యాలయం

అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లోనే పరీక్షలు నిర్వహించాలి

శాస్త్రవేత్తలు పంటలు సాగుచేసే ముందు మట్టి పరీక్షలు చేయించుకోవాలని సలహా ఇస్తున్నారు. అందుకు అనుగుణంగా రైతులు మట్టి పరీక్షలు చేయించుకుంటున్నారు. స్థానికంగా అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఉన్నప్పటికీ అది రైతులకు ఉపయోగపడడంలేదు. అధికారులు చర్యలు తీసుకొని మట్టినమూనా పరీక్షలు స్థానికంగానే నిర్వహించేలా చూడాలి.


యోగీశ్వరులు, రైతు, సీ కోడిగేపల్లి

మట్టి పరీక్షకు పరికరాలు లేవు : ఎలిజబెత్, ఏఓ

ప్రస్తుతం ఇక్కడ ఉన్న అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నాం. మట్టినమూనా పరీక్షలకు కావాల్సిన పరికరాలు లేవు. ఇందుకోసం రైతులు పెనుకొండ, అనంతపురంకు వెళ్లాల్సివస్తోంది. ఇక్కడే పరికరాలు ఏర్పాటుచేస్తే సౌకర్యంగా ఉంటుంది.

పురంలో బాలయ్య బిజీ.. బిజీ

● వినతులు ఇవ్వడానికి పోటెత్తిన జనం
● సమస్యలు సావధానంగా విన్న ఎమ్మెల్యే

హిందూపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మూడు రోజులపాటు బిజీ బిజీగా గడిపారు. మొదటిరోజు ఇటీవల మృతిచెందిన టీడీపీ నాయకులు జేఈ వెంకటస్వామి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకుని సమస్యలపై ఆరాతీశారు. రెండోరోజు నియోజకవర్గంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అధికారులతో సమీక్ష జరిపారు. పట్టణాభివృద్ధి కోసం అహుడా చైర్మన్ డీసీ వరుణ్ ఎమ్మెల్యేతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హిందూపురానికి అహుడా నిధులు అధిక మొత్తంలో కేటాయించాలని సూచించారు. దీనికి ఆయన సుముఖత వ్యక్తం చేశారు. హిందూపురంలో శాంతి భద్రతల విషయంపై సీఐలకు దిశానిర్దేశం చేశారు. నిరుపేదలకు ఇంటి స్థలాలపై తహసీల్దార్‌కు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాజధాని అభివృద్ధికి, ముఖ్యమంత్రి సహాయనిధికి అన్నాక్యాంటీన్ నిర్వహణకు చెక్కులను స్వీకరించారు. ఈ సందర్భంగా పలు కులసంఘాల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. సమస్యలు విన్నవించడానికి బుధవారం ఉదయం ఎమ్మెల్యే నివాసం వద్ద జనం పోటెత్తారు. ఉదయం నుంచి ఎమ్మెల్యే బయలుదేరేవరకు ఇంటి ముందు రద్దీ నెలకొంది. అనంతరం సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఎమ్మెల్యేతో కలిశారు. విద్యార్థి సంఘం నాయకులు పట్టణంలో మోడల్ డిగ్రీ కళాశాల, ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు. మధ్యాహ్నం అనంతపురంలో జరిగే డాకు మహరాజ్ విజయోత్సవ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు.


ఎమ్మెల్యేను కలవడానికి ఇంటి బయట వేచి ఉన్న జనం


చెక్కును అందజేస్తున్న ఎల్ఆర్‌జీ విద్యాసంస్థల డైరెక్టర్, కార్యదర్శి

ముఖ్యమంత్రి సహాయనిధికి చెక్కు ఇచ్చిన ఎల్ఆర్‌జీ

ముఖ్యమంత్రి సహాయనిధికి ఎల్ఆర్‌జీ విద్యాసంస్థ చెక్కును అందించారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ఎల్ఆర్‌జీ విద్యాసంస్థల డైరెక్టర్ నిఖిల్ గోవింద రామ్మూర్తి, కార్యదర్శి బాలసుందరంలు అందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ఏఓ రఘు, సంజీవరెడ్డి, హెచ్ఎం ప్రసాద్‌లు పాల్గొన్నారు.

మిరప పంటను పరిశీలించిన మంత్రి సవిత

పెనుకొండ రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలోని రైతు నారాయణనాయక్ వ్యవసాయ పొలంలో పండించిన మిరపపంటను బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పరిశీలించారు. మిరపపంటను పండించడానికి ఎంత ఖర్చయింది. లాభనష్టాలపై రైతుతో అడిగి తెలుసుకున్నారు. మంత్రి సవిత మాట్లా డుతూ రైతన్నకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అశ్వర్థనారాయణ, మనోహర్ పాల్గొన్నారు.

ఇజ్‌తెమా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి

పెనుకొండలోని కొండాపురం వెళ్లే రహదారిలో రైల్వే స్టేషన్‌లో పక్కన ఫిబ్రవరి 5, 6న జరిగే ఇజ్‌తెమా ఏర్పాట్లను బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పరిశీలించారు. రెండ్రోజులపాటు నిర్వహించే ఇజ్‌తెమాలో అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా అక్కడ ప్రజలకు అవసరమైన తాగునీరు, సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట మైనార్టీనాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పరిశీలన

రొద్దం మండలం శ్యాపురం వద్ద గోపాలస్వామి గుడికి వెళ్లే రోడ్డు, కంబాలపల్లిలో రూ.80లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్లను బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పరిశీలించారు. రోడ్ల నిర్మాణంలో ఎక్కడా అలసత్వానికి తావులేకుండా నాణ్యతతో నిర్మించాలని కాంట్రాక్టర్లను సూచించారు. ఎట్టకేలకు తమ గ్రామాలకు సీసీరోడ్లు రావడంతో మంత్రి సవితను గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బొక్సంపల్లి, కంబాలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు.


శ్యాపురంలో మిర్చి పంటను పరిశీలిస్తున్న మంత్రి సవిత

మృతుని కుటుంబానికి మంత్రి పరామర్శ

సోమందేపల్లి: సోమందేపల్లి మండల కేం ద్రంలో అనారోగ్యంతో మృతిచెందిన టీడీపీ సీనియర్ నాయకులు నిమ్మకాయల రామాంజినేయులు కుటుంబాన్ని మంత్రి సవిత పరామర్శించారు. భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలువేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు డీవీ ఆంజనేయులు, నీరుగంటి చంద్ర, సిద్దలింగప్ప, వడ్డె సురేష్, వెంకటేశులు, సూర్యనారాయణ, నరసింహులు, ఆకుల రమణ, శ్రీరాములు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

గోరంట్ల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బాలికను వెంట తీసుకెళ్లిన మండలంలోని నారసింపల్లికి చెందిన దళిత యువకుడు ఆంజనేయులుపై బుధవారం గ్రామంలో దాడి చేశారు. లారీడ్రైవర్ అయిన ఆంజనేయులు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ఇటీవల తీసుకెళ్లాడు. హిందూపురంలో ఉన్న బాలికను కుటుంబీకులు పిలుచుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఆంజనేయులు బుధవారం నారసింపల్లికి వచ్చినట్లు తెలుసుకున్న బాలిక కుటుంబీకులు.. అతడిపై దాడి చేశారు. దీనిపై పోలీసు స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఆంజనేయులుపై బాలిక కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఆంజనేయులుపై పోక్సో కేసు, బాలిక కుటుంబీకులు, బంధువులు ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు నమోదు చేసినట్లు గోరంట్ల అప్‌గ్రేడ్ సీఐ శేఖర్ తెలిపారు.


పోస్టర్ల విడుదల

పెనుకొండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అరెకటిక కుల దైవాలైన సునామ జెకినిమాత మల్కామ జికినిమాత 22వ వార్షికోత్సవాలను ఫిబ్రవరి 6, 7 తేదీల్లో గుత్తిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు మల్కారి ఆలూరి లక్ష్మణ్‌రావు, ఉపాధ్యక్షుడు కోటంకారి రాజేష్‌ఖన్న తెలిపారు. బుధవారం ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను టీడీపీ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చేతులమీదుగా నాయకులు ఆవిష్కరింపజేశారు. అనంతరం కమిటీ సభ్యులు మంత్రిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహిళా కమిటీ సభ్యులు స్వాతి, సంఘం పెద్దలు ప్రతాప్, అయ్యప్ప యూత్ సంఘం సభ్యులు సుధీర్, కాశీనాథ్, లోకేష్, వంశీ, నాగార్జున, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రజతోత్సవం

మడకశిరటౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) హిందూ పురం రోడ్డులోని జ్ఞానయోగ కళామందిరం ఆవరణలో బుధవారం బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రజతోత్సవాలు, సర్వధర్మసమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బ్రహ్మకుమారీలు ఆధ్యాత్మిక చింతనతోపాటు ఎన్నో కార్యక్రమాల ద్వారా దైవ చింతనను పెంపొందిస్తున్నారని, సమాజంలో మార్పు కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు పెంపొందించడంతోపాటు అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమాన్ని ఘనంగానిర్వహించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వై.టి.ప్రభాకర్‌రెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, బ్రహ్మకుమారీలు తదితరులు పాల్గొన్నారు.

తుమల్ అధ్యక్షుడిగా పావగడ ఎమ్మెల్యే


పావగడ ఎమ్మెల్యేను అభినందిస్తున్న మంత్రులు

పావగడ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): తుమల్ అధ్యక్ష పదవి పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్‌ను వరించింది. గత నవంబరు 26న జరిగిన పాల ఉత్పాదకుల సంఘ డైరెక్టర్ ఎన్నికల్లో తుమకూరు జిల్లా వ్యాప్తంగా ఏడుగురు కాంగ్రెస్ డైరెక్టర్లు, ఇద్దరు ఇండిపెండెంట్, ఒక బీజేపీ డైరెక్టర్ గెలుపొందారు. తుమల్ అధ్యక్షపదవికి ప్రస్తుతం క్యాబినెట్‌లో సహకారమంత్రిగా పనిచేస్తున్న కెఎన్ రాజన్న, కెఎస్ఆర్టీసీ నిగమ అధ్యక్షునిగా కొనసాగుతున్న గుబ్బి ఎమ్మెల్యే శ్రీనివాస్ సతీమణి భారతిల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అయితే వీరిద్దరిని వద్దనుకుని వెనుకబడిన ప్రాంతం పావగడకు అధ్యక్ష పదవి కట్టబెట్టాలన్న అదిష్టానం నిర్ణయంతో పావగడ ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్‌ను నామినేటెడ్ డైరెక్టర్‌గా ఎన్నుకుని బుధవారం అధ్యక్ష ఎన్నికల్లో ఆయనను గెలిపించారు. సహకార మంత్రి రాజన్న, హోమ్‌మంత్రి పరమేశ్వర్, కెఎస్ఆర్టీసీ నిగమ అధ్యక్షుడు శ్రీనివాస్, డైరెక్టర్లు కలిసి బుధవారం తుమల్ అధ్యక్షుడు పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు.

న్యూస్ బాక్స్

ఘనంగా అయోధ్య రాముడి సంబరాలు


రాముడికి పూజలు నిర్వహిస్తున్న గీతానగర్ వాసులు

గోరంట్ల, సోమందేపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగి, బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా గోరంట్ల పట్టణంలోని ఫ్రెండ్లీగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వేడుకలు జరుపుకున్నారు. బాలరాముని చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం వడపప్పు, బెల్లం పానకాన్ని పంపిణీ చేశారు.

సోమందేపల్లి మండలకేంద్రంలోని గీతానగర్‌లో అయోధ్య రాముడికి స్థానిక ప్రజలు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

మడకశిర రూరల్: మండలంలో మరువపల్లి గ్రామంలో శ్రీరామ ఆలయంలో బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు హారతులతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు తీర్చుకొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

పెనుకొండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి):విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పెనుకొండ మండలంలో వివిధ పాఠశాలల్లో రామాయణంపై క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. విశ్వహిందూపరిషత్ ప్రఖండ్ అధ్యక్షుడు వేదవ్యాస్ ఆధ్వ ర్యంలో 18పాఠశాలల్లో 965మంది విద్యార్థులు పాల్గొన్నారు. పరీక్షల్లో పాసైన వారికి జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తామన్నారు.

టెన్త్ విద్యార్థుల ఇళ్ల వద్దకు టీచర్లు


విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న టీచర్లు

లేపాక్షి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలు దగ్గరపడుతున్న సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లవద్దకు వెళ్లి వారిగురించి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. విద్యార్థుల మార్కుల జాబితాను తల్లిదండ్రులకు చూపించి వారి భవిష్యత్తుపై సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఈ వినూత్నమైన కార్యక్రమానికి పులమతి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీ-గ్రేడ్, సీ-గ్రేడ్ విద్యార్థుల ఇళ్లవద్దకు వెళ్లి తల్లిదండ్రులతో చర్చించి విద్యార్థుల దినచర్యలో మార్పు తీసుకురావడానికి సూచనలు, సలహాలు ఇస్తున్నామన్నారు. పరీక్షలు దగ్గర పడుతుండటంతో తల్లిదండ్రులు సైతం విద్యార్థులపట్ల శ్రద్ధ వహించాలని సూచిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడంవల్ల విద్యార్థుల్లో మార్పు వస్తుందని చదువుపై ఏకాగ్రత వస్తుందని తెలిపారు.

ఆసుపత్రి తనిఖీ

గోరంట్ల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి బుధవారం తనిఖీ చేశారు. జిల్లా మలేరియా అధికారి ఓబులతోపాటు, అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మీనాయక్, సబ్‌యూనిట్ అధికారి శివన్న పాల్గొన్నారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించి, వైద్యసేవల గురించి మెడికల్ అధికారి మాధవితో చర్చించారు. అనంతరం ల్యాబ్‌లోని రికార్డులు, పరికరాలు, మందులు, రక్త పరీక్షలకు ఉపయోగించే స్లైడ్లు పరిశీలించి, గడువు ముగిసిన మందుల వినియోగం జరుగుతోందా అని పరిశీలించారు. వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు.


కుష్ఠువ్యాధిపై ఇంటింటి సర్వే

సోమందేపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి నివారణ చర్యల్లో భాగంగా బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం సాయినగర్ అంబేడ్కర్ కాలనీలో ఇంటింటి సర్వేను నిర్వహించారు. ఈసందర్భంగా అనుమానితులను పరీక్షించి వ్యాధి నిర్ధారణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు ఓంకార్ మాట్లాడుతూ.. రాగిరంగు ఎర్రటి మచ్చలు ఉండి స్పర్శలేకుండా ఉంటే అలాంటివారు కుష్ఠువ్యాధి నివారణ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఒకవేళ వ్యాధినిర్ధారణ అయితే ప్రభుత్వం అందించే ఉచిత మందులు వాడి భవిష్యత్తులో అంగవైకల్యం రాకుండా నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మనోహర్‌రెడ్డి, రవీంద్ర, ఎఎన్ఎం గంగమ్మ, ఆశలు భారతి, శ్రీపతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

శిరివరం చేపలచెరువు వేలం

లేపాక్షి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): శిరివరం మానెంపల్లి గ్రామాలకు అనుసంధానంగా ఉన్న చేపల చెరువు వేలం పాటను బుధవారం శిరివరం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నేత్రావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలంపాటలో పది మంది పాల్గొనగా శిరివరం గ్రామానికి చెందిన కిష్టప్ప అత్యధికంగా రూ.2.10లక్షలకు దక్కించుకున్నారు. గతేడాది కన్నా ఈసారి రూ.1.10లక్షలు అదనంగా పంచాయతీకి ఆదాయం లభించిందని పంచాయతీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కందిలో పంటకోత ప్రయోగాలు


కంది పంట కోత ప్రయోగం చేస్తున్న ఏఓ

పరిగి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగుచేసిన కంది పంట కోత ప్రయోగాలను బుధవారం మండల పరిధిలోని వన్నంపల్లిలో మండల వ్యవసాయశాఖాధికారి విజయభారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె తెలిపిన వివరాల మేరకు రైతు పార్వతమ్మ 219/2 సర్వేనంబరులో చేసిన పంట కోత ప్రయోగాలలో బీమా కంపెనీ కోఆర్డినేటర్ అశోక్, నరేంద్ర పాల్గొని పర్యవేక్షించారు.

ఘనంగా దత్తాత్రేయ స్వామికి అష్టోత్తర పూజ



మడకశిర టౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిరిడీసాయినాథుడి ఆలయం ఆవరణలో వెలిసిన దత్తాత్రేయస్వామికి బుధవారం పుష్య బహుళ అష్టమి సందర్భంగా అష్టోత్తర పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 6.30 గంటల నుంచే స్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర పూజ, విశేష అలంకరణ, అభిషేకం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనేక మంది భక్తులు పాల్గొని స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు జరిపించారు.

వెంకటస్వామి సేవలు మరువలేనివి


వెంకటస్వామికి నివాళులు అర్పిస్తున్న పట్టణ ప్రముఖులు

హిందూపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు, ప్రభుత్వ ఆసుపత్రి మాజీ చైర్మన్ జేఈ వెంకటస్వామి సేవలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు. బుధవారం వైకుంఠ సమారాధన కార్యక్రమం జరిగింది. దీనికి పట్టణంలోని ప్రముఖులు, పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంకటస్వామి కుల అభివృద్ధికి ఎంతగానో పాటుపడ్డాడన్నారు. నమ్ముకున్న వారికోసం ప్రాణాలు అర్పించి పనిచేశారన్నారు. హిందూపురం రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, మునిసిపల్ వైస్ చైర్మన్ విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, టీడీపీ సీనియర్ నాయకుడు నాగరాజు, జేపీకే రాము, బాలాజీ మనోహర్, మండల కన్వీనర్ అశ్వర్థరెడ్డి, అరుణాచలరెడ్డి, మంగేష్, దేమకేతేపల్లి అంజినప్ప, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రమోహన్, ప్రియా గంగాధర్, బాచి పలువురు కౌన్సిలర్లు, నాయకులు వెంకటస్వామి కుటుంబ సభ్యులు మాజీ మునిసిపల్ చైర్మన్ అనిల్‌కుమార్, వేణు, వెంకటస్వామి సతీమణి, జయమ్మ, త్రిమూర్తి పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

చిలమత్తూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ఏపీఓ అప్పస్వామినాయుడు కోరారు. మండలంలో 2970 మందికి ఉపాధి హామీ పథకంలో పనులు కల్పిం చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అయితే కేవలం 800 మంది మాత్రమే పనులకు హాజరవుతున్నారన్నారు. చేసిన పనులకు వెంటనే బిల్లులు మంజూరు అవుతున్నాయన్నారు. ఇప్పటికే ఫారంపాండ్లు, ఫిష్ పాండ్‌లు, అమృత సరోవర్, కాలువల పూడికతీత, సరిహద్దు కందకాలు, మొక్కల పెంపకానికి ట్రెంచుల తవ్వకాలు చేపడుతున్నామన్నారు. పశుసంవర్ధక శాఖతో అనుసంధానమై గొర్రెలు, పాడి ఆవులు, కోళ్ల పెంపకానికి మినీ గోకులం షెడ్లు లబ్ధిదారులకు నిర్మిస్తున్నామన్నారు.

పశువైద్య శిబిరాలను ఉపయోగించుకోండి


ఆరోగ్య శిబిరం క్యాట్‌లాగ్‌ను ప్రదర్శిస్తున్నబాలాజీనాయక్

సోమందేపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పశువైద్యశిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు బాలాజీనాయక్ తెలిపారు. బుధవారం మండ్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో 25దూడలకు 55ఆవులకు 2039 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను తాపామన్నారు. అనంతరం ప్రథమ చికిత్సలు చేశామన్నారు. ఆరోగ్యశిబిరాలు ఈనెల 31వరకు పంచాయతీల వారీగా ఏర్పాటు చేస్తామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇరిగేపల్లి పంచాయతీలో ఉచిత పశువైద్య శిబిరం

అగళి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇరిగేపల్లి పంచాయతీలోని నందరాజనపల్లి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో జాతీయ పశు ఆరోగ్య నియంత్రణ వారోత్సవాల్లో భాగంగా ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఈనెల 31వరకు కూడా ఉచిత పశువైద్య ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఉచిత పశు ఆరోగ్య శిబిరాల ద్వారా పశువులకు ఉచిత వైద్యం, చూడి పరీక్షలు, ఎదకు రాని పశువులకు పరీక్షలు చేసి ఎదకు వచ్చే విధంగా మందులు, తగు సలహాలను రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

ఉపాధి హామీపై సమీక్ష : ఎంపీడీఓ

అమరాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అమరాపురం మండల కేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ రామారావు అధ్యక్షతన ఉపాధిహామీ సమీక్ష నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఉపాధి హామీ కూలీలను పెంచాలని, ఉపాధి కూలీలకు అనుగుణంగా ప్రతి రోజూ ఒక్క కూలీకి రూ.300 వచ్చే విధంగా చూడాలని క్షేత్ర సహాయకులను ఆదేశించారు. మినీ గోకులం షెడ్‌లు, గొట్‌పాండ్స్, పర్క్యులేషన్‌పాండ్స్, రింగ్‌ట్రెంచ్‌లు, పండ్ల తోటల పెంపకం, బుష్ ప్లాంటేషన్, మల్బరీషెడ్లు తదితర వాటిని అధికారులు ఇచ్చిన సమయం కంటే ముందుగానే పూర్తి చేయాలని సాంకేతిక సహాయకులను, క్షేత్ర సహాయకులను ఆదేశించారు.

సీసీ రోడ్డు కొలతల సేకరణ

రొళ్ల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలంలోని మల్లినమడుగు గ్రామంలో సీసీ రోడ్డు శరవేగంగా పూర్తి చేశారు. అదేవిధంగా సీసీ రోడ్డు కొలతలు తీశారు. అనంతరం బి.జి.హళ్లికి కూటమి ప్రభుత్వం కల్వర్టు కోసం రూ.30లక్షలు మంజూరు చేసింది. అందుకోసం బుధవారం కల్వర్టుకు మార్కింగ్ ఇచ్చారు. టెండర్ లబ్ధిదారులకు పారదర్శకంగా ఉండాలని ఈసందర్భంగా తెలియజేశారు. ఈకల్వర్టును వెంటనే ఫిబ్రవరి లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కల్వర్టు మార్కింగ్ ఇవ్వడంతో బి.జి.హళ్లి హైస్కూల్ పిల్లలు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధి సిబ్బందికి సమీక్షా సమావేశం

రొళ్ల మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఏపీడీ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలశాతం పెంచాలని, క్యాటిల్‌షెడ్లు పూర్తి చేయాలని, వంద రోజుల ఉపాధి కల్పించాలన్నారు.

పోలీసుల అదుపులో చోరీ కేసు నిందితులు..?

పెనుకొండ రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నారాయణమ్మ కాలనీలో రెండు రోజుల క్రితం చోరీకి సంబంధించి పెనుకొండ పోలీసులు పలువురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నారాయణమ్మ కాలనీలో రెండు రోజుల క్రితం ఉపాధ్యాయుడి ఇంట్లో దొంగలు చొరబడి, 37తులాల బంగారం, లక్ష రూపాయల నగదును అపహరించిన సంగతి తెలిసిందే. వారి ఫిర్యాదు మేరకు పెనుకొండ పోలీసులు క్లూస్‌టీమ్ ద్వారా ఘటనా ప్రదేశంలో నిందితుల వేలిముద్రలు సేకరించారు. సీసీ టీవీ ఫుటేజీ ద్వారా నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.